# చెడుపై.. విజయానికి ప్రతీక విజయదశమి



రావణ దహన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతున్న మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

**• మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్**

మీర్‌పేట్, అక్టోబర్ 24 : చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక విజయదశమి అని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. విజయదశమిని పురస్కరించుకుని సనత్‌నగర్, అమీర్‌పేట్‌లలోని దేవాలయాల్లో జరిగిన శమీ వృక్ష పూజలతో పాటు రావణ దహన కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ వేడుకల్లో మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌తో పాటు కార్పొరేటర్ కొలను లక్ష్మి రెడ్డి, మాజీ కార్పొరేటర్ ఎన్. శేషుకుమారి తదితరులు పాల్గొన్నారు. సనత్‌నగర్‌లో జరిగిన రావణ దహన కార్యక్రమానికి అశేంగా తరలివచ్చిన ప్రజానీకానికి మంత్రి పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

**బల్కంపేట ఎల్లమ్మ ఆలయంలో శమీ పూజలు..**

విజయదశమిని పురస్కరించుకుని బల్కంపేట ఎల్లమ్మ ఆలయంలో శమీ పూజ జరిగింది. దేవాలయ చైర్మన్ కొత్తపల్లి సాయిగౌడ్, ఈవో కుంట నాగరాజు పాల్గొన్నారు. ఆలయ ముఖ్య అర్చకులు అనిల్‌కుమార్ పర్యేవేక్షణలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ విశేష పూజా కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారి ఆలయంలో శమీ పూజ నిర్వహిస్తున్న అర్చకులు



అమీర్‌పేట్ కనకదుర్గమ్మ ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న మంత్రి తలసాని

## హమాలిబస్తీలో బొడ్రాయికి పూజలు



హమాలిబస్తీలో బొడ్రాయికి పూజ చేసిన పవన్‌కుమార్ గౌడ్, బస్తీవాసులు

బన్సీలాల్‌పేట్, అక్టోబర్ 24 : పద్మారావునగర్‌లోని హమాలిబస్తీలో బొడ్రాయికి మంగళవారం సాయంత్రం బీఆర్‌ఎస్ ఇన్‌చార్జి జీ.పవన్‌కుమార్ గౌడ్, బస్తీవాసులు పూజలు నిర్వహించారు. హమాలిబస్తీ ఫేజ్ 1, ఫేజ్ 2 వాసుల చిరకాల కోరిక మేరకు బుధవారం ఉదయం వేద పండితులు శాస్త్రోక్తంగా ప్రజల సమక్షంలో బొడ్రాయి ప్రతిష్టాపన జరుగుతుందని పవన్‌కుమార్ గౌడ్ తెలిపారు. ఈ పూజలకు ముఖ్య అతిథులుగా మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, డిప్యూటీ స్పీకర్ టి.పద్మారావు గౌడ్ హాజరవుతారని ఆయన తెలిపారు. గత కొంతకాలంగా బస్తీవాసుల పనులు కాకపోవడం, అవాంచనీయ సంఘటనలు జరగడంతో స్థానికులు వేద పండితులను సంప్రదించారని, వారి సూచన మేరకు బస్తీలో బొడ్రాయిని నిలిపి పూజలు చేయాలని నిర్ణయం తీసుకోవడం జరిగిందని పవన్‌కుమార్ తెలిపారు. బస్తీవాసులు ఐకమత్యంగా ఉండాలని, రాబోయే రోజుల్లో అందరికీ మంచి జరగాలన్నదే ప్రభుత్వం ఆలోచన అని అన్నారు.

## అన్నప్రసాద వితరణ..



బల్కంపేట ఎల్లమ్మ దేవాలయం సమీపంలోని శ్రీ దుర్గా కన్వెన్షన్ నిర్వాహకులు బీఆర్‌ఎస్ నాయకులు వనం శ్రీనివాస్ ఆధ్వర్యంలో నెలకొల్పిన దుర్గామాత వద్ద పూజలు వైభవంగా జరుగుతున్నాయి. బుధవారం అమ్మవారి నిమజ్జనం జరుగనుంది. ఈ మేరకు మంగళవారం అమ్మవారి మండపం ఆవరణలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఎన్.శేషుకుమారి పాల్గొన్నారు భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి అమ్మవారి అన్నప్రసాదాన్ని సీవకరించారు. **– అమీర్‌పేట్, అక్టోబర్ 24**

## బెంచ్ ప్రెస్ ఛాంపియన్‌షిప్ విజేతలకు సన్మానం



విజేతలను సన్మానించిన రంగారెడ్డి జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ చైర్మన్ కొత్తపల్లి రమేశ్‌గౌడ్

అమీర్‌పేట్, అక్టోబర్ 24 : హైదరాబాద్ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 21న నగరంలో జరిగిన తెలంగాణ రాష్ట్ర బెంచ్ ప్రెస్ ఛాంపియన్‌షిప్ 2023 పోటీల్లో రంగారెడ్డి జిల్లా క్రీడాకారులు సత్తా చాటారు. ఈ పోటీల్లో సబ్ జూనియర్స్, సీనియర్స్, మాస్టర్స్ విభాగాల్లో పలువురు పతకాలు సాధించారు. మాస్టర్స్ విభాగంలో జ్ఞానప్రకాశ్, సి.పి.మిశ్రాలు బంగారు పతాకాలు సాధించగా, జూనియర్స్ విభాగంలో భార్గవ్, ముఖేఉశ్, స్వప్నిక్‌లు బంగారు పతకాలు సాధించారు. సబ్ జూనియర్స్ విభాగంలో మనోజ్‌కుమార్ కాంస్య పతకాన్ని పొందగా, సీనియర్స్ విభాగంలో సాయిరాజ్ వెండి పతకాన్ని సాధించారు. కాగా విజేతలకు సనత్‌నగర్‌లోని యాష్ జిమ్‌లో మంగళవారం జరిగిన ఓ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ చైర్మన్ కొత్తపల్లి రమేష్‌గౌడ్ ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కోచ్ ఆనంద్ రాజ్, ప్రధాన కార్యదర్శి పి.గోపాలకృష్ణ గౌడ్, కార్యనిర్వాహక కార్యదర్శి కొండల్‌రావు, కార్యదర్శి తాళ్ల శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## అందరి భాగస్వామ్యంతో బతుకమ్మ విజయవంతం



బతుకమ్మ బహుమతులు అందుకుంటున్న విజేతలు

అమీర్‌పేట్, అక్టోబర్ 24 : బతుకమ్మ వేడుకలను సనత్‌నగర్ జెక్ కాలనీలో విజయవంతం చేయడం పట్ల కాలనీ ఉత్సవ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు చింతిరెడ్డి ప్రభ, ఎస్ అన్నపూర్ణ (దేవాదాయ సహాయక కమిషనర్), కొండ్రాజు రమణమ్మ, ఎ.విజయలక్ష్మి, ఆదిలక్ష్మి దేవి, పుర్మాని భాగ్యలత, సుమ, వాణి కాలనీ మహిళలకు కృతజ్ఞతలు తెలిపారు. బతుకమ్మ వేడుకలు గతంలో ఎన్నడూ జరగనంత ఘనంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో బతుకమ్మ వేడుకలను ఘనంగా కొనసాగించేందుకు మరింత కృషి చేస్తామని అన్నారు. ఇదిలా ఉంటే కాలనీలో బతుకమ్మ వేడుకలు విజయవంతం కావడానికి గతంలో బల్కంపేట ఎల్లమ్మ దేవాలయం, ఉజ్జయిని మహంకాళి దేవాలయం (సికింద్రాబాద్)లలో జరిగిన బతుకమ్మ వేడుకలను విజయవంతం చేసేందుకు ఆయా ఆలయాలకు ఈవో, సహాయ కమిసనర్‌గా పని చేసిన కాలనీ ఉత్సవ కమిటీ ప్రధాన కార్యదర్శి ఎస్.అన్నపూర్ణ తీసుకున్న చొరవ ప్రశంసనీయమని కాలనీ మహిళలు అభినందలు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా బతుకమ్మలు సంప్రదాయ పద్ధతుల్లో తీర్చిదిద్ది మొదటి బహుమతి పొందిన నాగమణి, రెండవ బహుమతి ప్రభ అనంతరెడ్డి, మూడవ బహుమతి స్వాతి, నాల్గవ బహుమతి లత, అయిదవ బహుమతిని గెల్చుకున్న హరితలను ఈ సందర్భంగా అభినందించారు.

## తరుణ్ హత్యకు గల కారణాలపై మంత్రి ఆరా..



అమీర్‌పేట్ డివిజన్ బాపూనగర్‌కు చెందిన యువకుడు తరుణ్ సోమవారం రాత్రి హత్యకు గురయ్యాడు. విషయం తెలుసుకున్న మంత్రి తలసాని మంగళవానం ఉదయం గాంధీ మార్చురీలో తరుణ్ మృతదేహాన్ని సందర్శించారు. అనంతరం అక్కడే ఉన్న తరుణ్ కుటుంబ సభ్యులను హత్యకు దారి తీసిన వివరాలు అడిగి తెలుసుకున్నారు.

**– అమీర్‌పేట్, అక్టోబర్ 24**